ఎట్టకేలకు ఆర్‌ఓబీ పనులు

పనుల ప్రారంభంపై హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

చాంద్రాయణగుట్ట: ఫలక్‌నుమా రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) రెండో రూట్ నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. ఒకవైపు మాత్రమే వెళ్లాల్సిన వన్ వే వంతెనపై మరో వంతెన పూర్తికాని కారణంగా ఇరువైపులా వాహనాల రాకపోకలకు అధికారులు అనుమతించారు. దీంతో రెండేళ్లుగా వాహనదారులు ఇరుకుగా మారిన వంతెనపై రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతూ వచ్చారు. గత కొద్ది రోజులుగా రెండో వైపు వంతెన నిర్మాణ పనులు మొదలవ్వడంపై హర్షం వ్యక్తమవుతోంది. ఈ పనులు త్వరగా పూర్తయితే ఆర్‌ఓబీ పక్కనే ఉన్న హిందూ శ్మశానవాటికలో కూడా అంత్యక్రియల నిర్వహణకు కూడా ఇబ్బందులు తొలగనున్నాయి.



కాంక్రీట్ గోడల నడుమ మట్టిని నింపుతున్న దృశ్యం



ఫారూక్‌నగర్ రూట్‌లో నిర్మాణంలో ఫిల్లర్

ఒకవైపు కాంక్రీట్ గోడలు.. మరోవైపు ఫిల్లర్లు.

ఫలక్‌నుమా నుంచి చాంద్రాయణగుట్ట వైపు వెళ్లే రూట్‌లో ఆర్‌ఓబీ రెండేళ్ల క్రితమే వాహనదారులకు అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం దీనికి అనుసంధానంగా చాంద్రాయణగుట్ట నుంచి ఫలక్‌నుమా రూట్‌లో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. దీనికోసం కాంక్రీట్ గోడలు నిర్మించిన అధికారులు అందులో మట్టిని నింపుతున్నారు. రైలు పట్టాలపై ఫిల్లర్లతో కూడిన స్లాబ్ నిర్మాణం చేయాల్సి ఉంది. పట్టాల నుంచి ఫారూక్‌నగర్ డిపో వైపు రెండు ఫిల్లర్లను నిర్మిస్తున్నారు. ఈ రూట్‌లో అడ్డంకిగా ఉన్న భారీ తాగునీటి పైప్‌లైన్‌ను కూడా జలమండలి అధికారులు ఇప్పటికే మార్చారు.

వంతెన కింద నాలా మార్గం.. పాదచారులకు బాక్స్ మార్గం..

ఈ బ్రిడ్జికి ఎగువన హషామాబాద్ నుంచి వచ్చే నల్లవాగు నాలా నీరు ఈ బ్రిడ్జి కింది నుంచి సాఫీగా వెళ్లేందుకు భారీ బాక్స్‌డ్రైన్‌లను నిర్మించారు. పైన ఉన్న పల్లె చెరువు నుంచి ఎంత పెద్ద వరద వచ్చినా ఈ బ్రిడ్జికి అవరోధం కలగకుండా కాంక్రీట్‌తో నాలా మార్గాన్ని ఏర్పాటు చేశారు. దీంతో పాటు రైల్వే ప్రయాణికులు, ఇతర వాహనదారులు ఫలక్‌నుమా రైల్వే స్టేషన్‌కు సాఫీగా చేరుకునేలా ఆర్‌ఓబీ కింద భారీ కాంక్రీట్ బాక్స్‌తో మార్గాన్ని ఏర్పాటు చేశారు. బ్రిడ్జిపై పాదచారులు వెళ్లేందుకు కూడా వాహనాలతో సంబంధం లేకుండా ప్రత్యేక లైన్‌ను కూడా నిర్మించారు.

పాత వంతెన శిథిలావస్థకు చేరడంతో..

ఫలక్‌నుమా రైల్వే పట్టాలపై దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుని, 2020 అక్టోబర్‌లో కురిసిన భారీ వర్షాలకు కృంగిపోయి ప్రమాదభరితంగా మారిన విషయం విదితమే. బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవడం, వెడల్పు సైతం తక్కువగా ఉండటంతో వాహనాల రద్దీగా అధికమవుతూ.. వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ బ్రిడ్జిని ఆధునీకరించడంతో పాటు పక్కన నుంచే మరో కొత్త బ్రిడ్జి కూడా నిర్మించేందుకు జీహెచ్‌ఎంసీ శ్రీకారం చుట్టింది. ఫలక్‌నుమా నుంచి చాంద్రాయణగుట్ట రూట్‌లో వెళ్లే వాహనాలు ఒక బ్రిడ్జిపైకి వచ్చే వాహనాలు మరో బ్రిడ్జిపై వెళ్లేలా దాదాపు రూ.52 కోట్లతో పనులను ప్రారంభించారు. 2021 మార్చిలో వాహనాల రాకపోకలను పూర్తిగా నిషేధించి చాంద్రాయణగుట్ట వైపు వెళ్లే వంతెన పనులను పూర్తి చేసి అదే ఏడాది నవంబర్ 2న వాహనదారులకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి..



ఉదయం, సాయంత్రం వేళల్లో వంతెనపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటోంది. 5–6 నెలల్లో పనులు పూర్తి చేస్తామని చెప్పి ఏళ్లు గడుస్తున్నా పూర్తి చేయకపోవడం సరికాదు. జాప్యం కారణంగా నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రస్తుతం కొనసాగుతున్న పనులను వేగవంతం చేయాలి.

– సభావత్ గిరిధర్ నాయక్, ఫలక్‌నుమా.

అయ్యప్ప భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్



అబిడ్స్: శబరిమలైలో లక్షలాది మంది అయ్యప్ప భక్తులకు అక్కడి ప్రభుత్వం సౌకర్యాలు కల్పించకపోవడంతో అయ్యప్ప భక్తులంతా తీవ్ర ఇబ్బంది పడుతున్నారని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దూల్‌పేట్‌లోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. గత నెలరోజులుగా అయ్యప్ప భక్తులు దర్శనం లభించక రోడ్లపై పడిగాపులు కాస్తున్నా.. అక్కడి రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతో వ్యవహరిస్తోందని ఆరోపించారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి కేరళ ముఖ్యమంత్రితో వెంటనే మాట్లాడి అయ్యప్ప భక్తులకు అండగా నిలవాలని కోరారు.

ట్రాఫిక్‌జామ్‌తో తిప్పలు !

సుల్తాన్‌బజార్ : సుల్తాన్‌బజార్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్లపై వ్యాపారస్తులు లోడింగ్, అన్‌లోడింగ్ చేపట్టుతుండటంతో భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. చాదర్‌ఘాట్ సిగ్నల్ నుంచి సుల్తాన్‌బజార్ చౌరస్తా వెళ్లే దారిలో ఓ ఐస్క్రీం కంపెనీకి చెందిన వాహనాలు యథేచ్ఛగా రోడ్డు మధ్యలో వరకు మార్కింగ్ చేసిన లోడింగ్ చేస్తున్నారని విమర్శలున్నాయి. దీనిపై ట్రాఫిక్ సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రద్దీలేని సమయమైన ఉదయం ఆరు గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 9 నుంచి 10 గంటల వరకు లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

స్పీకర్‌కు శుభాకాంక్షల వెల్లువ



శుభాకాంక్షలు తెలుపుతున్న మార్వాడి సంఘాల నాయకులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ శాసనసభ స్పీకర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన గడ్డం ప్రసాద్‌ను మార్వాడీ సంఘాల నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేయాలని మార్వాడి శిక్ష సమితి కార్యదర్శి ఎస్‌బి.కాబ్రా, 'లవ్ ఫర్ కా ఫౌండేషన్' రిదేష్ జాగిర్దార్‌లు కోరారు. రాష్ట్రంలో పరిపాలన తమ వంతు సహకారం ఉంటుందని, ఆయా సంఘాల నాయకులు తెలిపారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్, సంక్షేమం సంమృద్ధిగా ఉండేలా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఆర్‌కే.జైన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ డిప్యుటేషన్లను రద్దు చేయాలని వినతి



మంత్రి దామోదర రాజనర్సింహకు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

నాంపల్లి: రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదరం రాజనర్సింహను రాష్ట్ర వైద్యుల సంఘం (డీహెచ్) విభాగం అధ్యక్షులు, ప్రముఖ చిన్న పిల్లల ఆసుపత్రి (నిలోఫర్ ఆసుపత్రి) డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ లాలూప్రసాద్ రాథోడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వైద్యరంగంలోని పలు అంశాలను ఆయన మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అక్రమ డిప్యుటేషన్లను రద్దు చేసి, సీనియారిటీ ప్రకారం పోస్టింగ్‌లను భర్తీ చేయాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

దేవాలయ పరిరక్షణకు కృషి



స్థానిక నాయకులతో ఆలయ కార్యనిర్వహణ అధికారిణి సంధ్యారాణి

గోల్కొండ: ఝూంమ్‌సింగ్ బాలాజీ దేవాలయాన్ని పూర్తిగా పరిరక్షిస్తామని ఆలయ కార్యనిర్వహణ అధికారిణి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం ఆమె గుడిమల్కాపూర్‌లోని ప్రాచీన శ్రీ ఝూంమ్‌సింగ్ బాలాజీ దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆలయ ప్రహరీ వద్ద ఆలయ సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. బీజేపీ నాయకులు ముఖేష్, భజరంగ్‌దళ్ గోల్కొండ జిల్లా కన్వీనర్ రాకేష్, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాస రామానుజం జయంతి



కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థినులు

గోల్కొండ: సాంకేతిక రంగంలో గణితానికి అత్యంత ప్రాధాన్యం ఉందని బిట్స్ హైదరాబాద్ ప్రొఫెసర్ డాక్టర్ వి.హరగోపాల్ అన్నారు. శుక్రవారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజం 136వ జయంతి వేడుకల సందర్భంగా 'మాథ్స్ క్లబ్ ఆప్టస్ గణ గణిత క్విజ్' ను నిర్వహించారు. ఈ పోటీల్లో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థినులు పాల్గొన్నారు. పోటీల విజేతలకు ఆయన నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విద్యలోనే కాకుండా గణితానికి శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. కృత్రిమ మేధస్సు, మిషిన్ లర్నింగ్, ప్రస్తుత అనువర్తనాలలో గణితం, గణాంకాల ప్రాముఖ్యతల గురించి ఆయన వివరించారు. కృత్రిమ మేధ వల్ల ఎన్నో అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. కృత్రిమ మేధకు నేడు అనూహ్యంగా ఆదరణ పెరుగుతోందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ గణిత క్విజ్ మూడు రౌండ్‌లలో నిర్వహించామని, నగరంలోని వివిధ కళాశాలలకు చెందిన 109 బృందాలు పాల్గొన్నాయన్నారు. హెచ్‌ఓడీ డాక్టర్ ఎం.మాధవిలత, గణిత క్రమశిక్షణ సమన్వయకర్త డాక్టర్ ఎం.అపర్ణ తదితరులున్నారు.

ముగిసిన స్వచ్ఛతా పఖ్వాడ కార్యక్రమాలు



సంతోష్‌నగర్: కంచన్‌బాగ్ డీఆర్‌డీఓ టౌన్‌షిప్‌లోని అవినాష్ చందర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఎస్టేట్ మేనేజ్‌మెంట్ యూనిట్ (ఆర్‌అండ్‌డీ) ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛతా పఖ్వాడా కార్యక్రమాలు ముగిశాయి. డిసెంబర్ 1న ప్రారంభమైన ఈ కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. 15 రోజుల పాటు స్వచ్ఛత శపథం, వ్యర్థాల తొలగింపు, ఇంటింటికి ప్రచారం ద్వారా స్వచ్ఛత కార్యక్రమంపై అవగాన కల్పించడంపై స్వచ్ఛతా పోటీలు నిర్వహించారు. ఎస్టేట్ మేనేజ్‌మెంట్ యూనిట్ ఆధ్వర్యంలో డిఫెన్స్ ల్యాబొరేటరీ స్కూల్, కేంద్రీయ విద్యాలయం విద్యార్థులకు జూనియర్, సీనియర్ విభాగాలుగా విభజించి పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఎస్టేట్ మేనేజ్‌మెంట్ యూనిటరీ చీఫ్ ఇంజినీర్, మేనేజర్ డాక్టర్ షేక్‌గౌస్ మోహిద్దీన్, చీఫ్ కన్‌స్ట్రక్షన్ ఇంజినీర్ డాక్టర్ అనిల్ ఖురానా పలువురు ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో మెట్ల బావులకు ఘన చరిత్ర



పుస్తకావిష్కరణలో వీసీ.కవిత దరియానిరావు, యశ్వంత్ రామమూర్తి

విజయనగర్‌కాలనీ: రాష్ట్రంలో మెట్ల బావులకు ఎంతో ఉన్నతమైన చరిత్ర ఉందని హైదరాబాద్ డిజైన్ ఫోరమ్ ప్రతినిధి యశ్వంత్ రామమూర్తి అన్నారు. శుక్రవారం మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీ ఆడిటోరియంహాల్‌లో హైదరాబాద్ డిజైన్ ఫోరమ్ ఆధ్వర్యంలో 'ది ఫర్‌గాటెన్ స్టెప్‌వెల్స్ ఆఫ్ తెలంగాణ' పేరిట గ్రంథావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 200 వరకు ఉన్న మెట్ల బావుల ప్రాధాన్యత ఎనలేనిదన్నారు. ప్రజలతో మమేకమైన, చారిత్రాత్మక నేపథ్యం కలిగిన మెట్లబావులను పరిరక్షించుకోవడంతో పాటు భావితరాలకు అందించే బాధ్యత మనపై ఉందన్నారు. బావుల్లో నీటిని శుద్ధి చేసేందుకు బతుకమ్మ పండుగనాడు పూలతో పేర్చిన బతుకమ్మలను నీళ్లల్లో వదలడం వల్ల నీరు పరిశుభ్రమవుతుందన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ డాక్టర్ కవిత దరియానిరావు మాట్లాడుతూ.. మెట్లబావుల్లో నీరు స్వచ్ఛంగా ఉండటంతో పూర్వకాలంలో ఊరి ప్రజలందరూ తాగేందుకు వాటిని వినియోగించేవారన్నారు. వేసవికాలంలో ఎండలు తీవ్రంగా ఉన్నప్పటికి మెట్లబావులు నీళ్లతో కళకళలాడుతూ... ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేవని వివరించారు. వీటివల్ల భూగర్భ జలాలు కూడా పెరుగుతాయన్నారు. ప్రజలు జీవితంలో అతి ముఖ్యంగా ఉన్న మెట్ల బావుల ప్రాధాన్యాన్ని వివరిస్తూ.. పలువురు ప్రముఖులు ప్రసంగించారు. మెట్ల బావుల గురించి వివరాలను తెలియజేస్తున్న పుస్తకం ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో పలువురు ఆర్కిటెక్ట్‌లు, స్కాలర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

యాకుత్‌పురా: ప్రజా సమస్యల పరిష్కారానికి అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తూ.. తగిన చర్యలు తీసుకుంటున్నామని రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించి బస్తీల్లో కొనసాగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి నిర్మాణ పనులపై అధికారులతో కలసి పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే డ్రైనేజ్, తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులను చేపట్టామన్నారు. పలు బస్తీల్లో నూతన సీసీరోడ్డు నిర్మాణ, ప్యాచ్‌వర్క్స్ పనులను చేపట్టామని తెలిపారు.

అన్నదానం



అబిడ్స్: అసద్ అన్వార్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు, టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌ఎం ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో మెహిదీనవాజ్ కేన్సర్ ఆసుపత్రి ఆవరణలో అన్నదానం నిర్వహించారు. శుక్రవారం దాదాపు 500 మంది రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ.. జీవితాంతం ప్రజాసేవకే అంకితమవుతానన్నారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్, నాయకులు శ్రీనివాస్, ఖలీద్ అహ్మద్, శంకర్, శ్రీధర్ నాయుడు, ముకీం ఖురేషి, చంద్రశేఖర్, మహ్మద్ వహీద్, ముస్తఫా షరీఫ్, హబీబ్ చావుస్‌లు పాల్గొన్నారు.

పాతబస్తీలో సీఎం పర్యటించాలి



కాంగ్రెస్ నేత రాజేందర్

చార్మినార్: సీఎం రేవంత్ రెడ్డి పాతబస్తీలో పర్యటించాల్సిన అవసరం ఉందని గ్రేటర్ కాంగ్రెస్ కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి టి.రాజేందర్ కోరారు. పాతబస్తీలో కాంగ్రెస్ పార్టీ నుంచి కార్పొరేటర్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు లేనందున సీఎం రేవంత్‌రెడ్డి పాతబస్తీపై ప్రత్యేక శ్రద్ధ వహించి పాతబస్తీలో పర్యటించిన అనంతరం అవసరమైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆదేశాలు జారీ చేయాలని ఆయన కోరారు. దివంగత నేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో పాతబస్తీ కోసం రూ.2వేల కోట్ల నిధులను విడుదల చేసి పలు అభివృద్ధి కార్యక్రమాలను జరిపించారన్నారు. ఇప్పటి వరకు పాతబస్తీలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని ఆరోపించారు.

డీసీసీబీ చైర్మన్‌గా సత్తయ్య



కొత్తకురుమ సత్తయ్య

గన్‌ఫౌండ్రీ : రాష్ట్రంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీని అగ్రస్థానంలో నిలబెట్టేందుకు కృషి చేస్తానని డీసీసీబీ నూతన చైర్మన్ కొత్తకురుమ సత్తయ్య తెలిపారు. శుక్రవారం డీసీసీబీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు. వారికి అవసరమైన గిడ్డంగులు, వాటర్ ప్లాంట్లు, రుణాల మంజూరుకు కృషి చేస్తామని, రైతుల సంక్షేమానికి సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్తామన్నారు.

ఉత్సవాలతో మతసామరస్యం



శ్రద్ధాంజలి ఘటిస్తున్న డీసీపీ సాయి చైతన్య

చార్మినార్: పాతబస్తీలో ఏ ఉత్సవాలైన శాంతి సామరస్యంతో పాటు మత సామరస్యాన్ని చాటి చెబుతాయని దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య అన్నారు. హుస్సేనీఆలంలోని జామే నిజామియా ఉర్దూ విశ్వవిద్యాలయం 152వ స్నాతకోత్సవంతో పాటు 106వ ఉర్సు ఉత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించిన అనంతరం ఉర్సు ఉత్సవాలలో పాల్గొని పూర్వీకుల సమాధుల వద్ద పూలతో శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాతబస్తీలో హిందూ, ముస్లింలు కలిసిమెలిసి ఉండటం తరతరాలుగా వస్తోందన్నారు. సోదర భావంతో ఉత్సవాలను నిర్వహించుకోవడమే కాకుండా ఒకరికొకరు సహకరించుకోవడం ఏళ్ల తరబడి వస్తోందని పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌తో స్థానిక నేత

గోల్కొండ: బస్తీలు, కాలనీ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం గోల్కొండ డివిజన్‌లోని మోతీదర్వాజ, యాదవబస్తీ, ఖాజీగల్లీ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి స్థానికులను కలుసుకున్నారు. మోతీదర్వాజ వద్ద పర్యటిస్తున్న ఆయనను స్థానికుడు అస్మర్ అన్వర్‌ఖాన్ కలిసి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలో పాత డ్రైనేజీ లైన్‌లను తొలగించి కొత్తవాటిని ఏర్పాటు చేస్తామన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు బదరుద్దీన్ తదితరులున్నారు.

తెలుగు వర్సిటీలో ప్రారంభమైన 'కెడల్ ఫెస్ట్'



కెడల్ ఫెస్ట్ ప్రారంభోత్సవం దృశ్యం

నాంపల్లి: జానపద గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు చర్యలు, ప్రదర్శనలు, పరిశోధనలు జరపాల్సిన ఆవశ్యకత ఉందని తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య తంగెడ కిషన్‌రావు అన్నారు. ఆదివాసీ, దళిత ఆర్ట్స్ అండ్ లిటరేచర్ ఉత్సవాలను 'కెడల్ ఫెస్ట్' పేరిట శుక్రవారం వర్సిటీలో సంబరాలను ప్రారంభించి మాట్లాడారు. ఆదివాసీ వస్తు సంస్కృతి అంతరించిపోతున్న తరుణంలో జానపద గిరిజన పరిశోధకులు ఆచార్య జయధీర్ తిరుమలరావు ఆద్యకళ పేరిట వస్తు ప్రదర్శన శాలలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆచార్య జయధీర్ తిరుమల రావు మాట్లాడుతూ... భారతీయ జానపద గిరిజన, ఆదివాసీ సంస్కృతిపై మక్కువతో ఫ్రాన్స్, జర్మనీ దేశాల నుంచి వైవిధ్యభరితంగా జరిగే రెండ్రోజుల కెడల్ ఫెస్ట్‌లో పాల్గొనేందుకు వచ్చిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. జర్మనీలోని నట్టింగంట్రెంట్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ నిలోల్ థియోరో మాట్లాడుతూ.. ప్రపంచ సంస్కృతి, నాగరికత గ్రామీణ మూలాల నుంచి వచ్చిందేనని, భవిష్యత్ తరం దానిపైనే ఆధారపడి ఉందని వివరించారు. ఫ్రాన్స్‌లోని పాల్ వెలమాంటోపిల్లర్ విశ్వవిద్యాలయం జోదిత్ బరాక్ మాట్లాడారు. తెలుగు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్, ఆచార్య గిరిజ, ఆచార్య విజయ్‌కుమార్, జానపద, గిరిజన ఆదివాసీ కళాకారులు పాల్గొన్నారు. ఆద్యకళ మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలని వినతి

బండ్లగూడ: తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. గత కొన్నేళ్లుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని శుక్రవారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కార్పొరేషన్ 1వ డివిజన్ వేంకటేశ్వరనగర్, విద్యానగర్ ఫేస్–2 కాలనీలలో కొన్నేళ్లుగా తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నామన్నారు. పైపులైన్లు వేసి నెలలు గడుస్తున్నా.. వాటిలో తాగునీరు రాకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. రోజూకూలీ చేస్తే గానీ గడవని జీవితాల్లో ఒక ట్యాంకర్ రూ.2 వేల చొప్పున నెలకు 4 ట్యాంకర్లు కొంటున్నారని, సదరు విషయం ఎమ్మెల్యేకు వివరించామన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ.. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రతి ఇంటికి తాగునీటి సౌకర్యాన్ని కల్పించనున్నామన్నారు. ఎన్నికల కోడ్ రావడంతో అర్థాంతరంగా పనులను పూర్తి చేయలేకపోయామని, త్వరలోనే పనులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు సమచారం. ఈ విషయమై జలమండలి జీఎం రవీందర్‌రెడ్డికి ఫోన్ చేసి తాగునీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా నాల్గోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఎమ్మెల్యేను పూలమాలలు అందించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. తలారి ప్రేమ్‌కుమార్, బత్తుల నరేందర్, కృష్ణసాగర్, నాగిరెడ్డి, సిద్దయ్య, రాము, విజయ్, వెంకటయ్య తదితరులున్నారు.

వ్యాపారాభివృద్ధికి పాతబస్తీ అనుకూలం



మాజీ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్‌ఖాన్‌తో మహ్మద్ అబ్దుల్ మాజీద్

చార్మినార్: వ్యాపారాభివృద్ధికి పాతబస్తీ ఎంతో అనుకూలంగా ఉందని చార్మినార్ మాజీ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్‌ఖాన్ అన్నారు. పిస్తాహౌజ్ మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ అబ్దుల్ మాజీద్ ఆధ్వర్యంలో శాలిబండ చౌరస్తాలో కొత్తగా ఏర్పాటు చేసిన మహనూర్ బంకెట్‌హాల్‌ను ఆయన శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హలీం, బిర్యానీ విక్రయాలలో పిస్తాహౌజ్ ప్రపంచ గుర్తింపు పొందిందని అభినందించారు. నిజాంకాలం నుంచి ఇక్కడ అన్ని రకాల వ్యాపారాలు కొనసాగుతున్నాయని, కొత్తగా వ్యాపారాలను స్థాపించేందుకు వచ్చే వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు ఇక్కడ ఉన్నాయన్నారు.

అక్రమ పార్కింగ్‌లపై కొరడా !



షేక్‌పేట్ డీమార్ట్ వద్ద వాహనాలను తరలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

గోల్కొండ: అక్రమ పార్కింగ్‌లపై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝులిపించారు. శుక్రవారం షేక్‌పేట్‌లోని డీమార్ట్ ఎదుట రోడ్డుపై అక్రమంగా పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను ట్రాఫిక్ పోలీసులు స్వాధీనం చేసుకుని గోల్కొండ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేవలం ద్విచక్ర వాహనాలనే టార్గెట్ చేస్తున్నారని పలువురు వాహనదారులు ఆరోపిస్తున్నారు. మెయిన్ రోడ్డు సగం వరకు పదుల సంఖ్యలో కార్లు అక్రమంగా పార్కు చేసినా.. పట్టించుకోవడం లేదని పలువురు ద్విచక్ర వాహనదారులు ఆరోపిస్తున్నారు.

జేఎన్‌ఎఫ్‌ఐయూలో తాగునీటి కటకట !



తాగునీటి కూలర్ ఇలా..

నాంపల్లి : మాసబ్‌ట్యాంక్‌లోని జేఎన్‌ఎఫ్ఏయూ వర్సిటీలో తాగునీటి కొరత నెలకొంది. తాగడానికి గ్లాసు మంచినీళ్లు కావాలంటే బయటి నుంచి తీసుకోవాల్సిన దుస్థితి వచ్చిందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వందలాది మంది విద్యార్థులు నగరం నలుమూలల నుంచి విద్యను అభ్యసించేందుకు వస్తుంటారు. ఉదయాన్నే వచ్చే విద్యార్థులు తిరిగి సాయంత్రం ఉంటూ.. తమ ఇళ్లకు వెళ్తుంటారు. మధ్యాహ్నం భోజనాల కోసం తమ వెంట వాటర్ బాటిల్స్‌ను మోసుకుని వచ్చే నెలకొంది. ఈ విషయమై వర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ విష్ణువర్ధన్‌ను వివరణ కోరగా.. తాగునీటి కూలర్లు పాడైపోయాయని వివరణ ఇచ్చారు. త్వరలోనే సరిచేసి ఈ సమస్య తిరిగి ఉత్పన్నం కాకుండా చూస్తామన్నారు. వర్సిటీలో తాగునీటికి కొరతే లేదన్నారు.

గంటల వ్యవధిలోనే బాధితుడికి బంగారం అప్పగింత

అత్తాపూర్: బంగారం పోగొట్టుకున్న వ్యక్తికి గంటల వ్యవధిలోనే రెండున్నర తులాల బంగారు బ్రాస్లెట్‌ను గుర్తించి బాధితుడికి అత్తాపూర్ పోలీసులు శుక్రవారం అందజేశారు. అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నంబర్ 230 ప్రాంతంలో ఉన్న హెరిటేజ్ ఫంక్షన్‌హాల్‌లో సమీప బంధువుల వివాహానికి యాదగిరి కుటుంబసభ్యులతో కలిసి హాజరయ్యాడు. పెళ్లి వేడుకల్లో భాగంగా హడావిడిలో ఉన్న యాదగిరి చేతిలోని బ్రాస్లెట్ పడిపోయింది. పడిపోయిన బ్రాస్లెట్‌ను ఓ వ్యక్తి గమనించి తీసుకుని పరారయ్యాడు. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని సీసీ కెమెరాల ఆధారంగా సదరు వ్యక్తిని గుర్తించి ఆ బంగారాన్ని యాదగిరి కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.